ఆదివారం
04-06-2023
సంపుటి - 08,
సంచిక - 319
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# ఒడిశా రైలు ప్రమాదం

## మృతుల సంఖ్య 288కి చేరిక

## ప్రమాదానికి సిగ్నలింగ్ సిబ్బంది నిర్లక్ష్యం




- వేయికి పైగా క్షతగాత్రులు...భద్రక్ ఆస్పత్రికి తరలింపు
- కొనసాగుతున్న సహాయ చర్యలు...సిఎం నవీన్ పట్నాయక్ రాక
- మృతుల కుటుంబాలకు పది లక్షల పరిహారం...విచారణకు ఆదేశం
- ఘటనపై ప్రధాని మోడీ, రాష్ట్రపతి ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి

**భువనేశ్వర్, జూన్3(సమ సమాజం):** ఒడిశా రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 238కి చేరింది. రైలు ప్రమాదంలో మరో 900 మందికిపైగా తీవ్రగాయాలు అయ్యాయి. బాలాసోర్‌లో గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ఘటనలో తొలుత సాధారణ ప్రమాదంగగా భావించారు. అయితే ఇది ఘోర ప్రమదంగా మారింది. దీంతో చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 13 బోగీలు పట్టాలు తప్పాయి. కోరమండల్ రైలు బోగీలపై యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ దూసుకెళ్లింది. ఘటనలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ 4 బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఘటనాస్థలంలో 200 అంబులెన్స్‌లు సహాయక చర్యలు అందిస్తున్నాయి. రైలు ప్రమాద ఘటనతో రైల్వే శాఖ 18 రైళ్లను రద్దు చేసింది. రైలు ప్రమాదంలో చనిపోయినవారికి రైల్వేశాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించనున్నట్టు తెలిపింది. ఇక తీవ్రంగా గాయపడినవారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందించనుంది. పశ్చిమబెంగాల్‌లోని షాలిమార్ నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు ప్రయాణిస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841) శుక్రవారం రాత్రి 7.20 గంటల సమయంలో పట్టాలు తప్పి గూడ్స్ రైలును ఢీకొంది. దాదాపు 15 కోచ్‌లు పట్టాలు తప్పగా.. వాటిలో ఏడు తిరగబడిపోయాయి. వాటిలో కొన్ని పక్కనే ఉన్న మరో ట్రాక్‌పై పడ్డాయి. కొద్దిసేపటికి.. ఆ రెండో ట్రాక్ మీదుగా హౌరాకు వెళ్తున్న బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12864) ట్రాక్‌పై పడి ఉన్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లను ఢీకొంది. ఆ తాకిడికి బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రె÷-స్కు చెందిన నాలుగైదు బోగీలు పట్టాలు తప్పినట్టు సమాచారం. తిరగబడిపోయిన బోగీల కింద వందలమంది చిక్కుకుపోయారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక తిరగబడ్డ కోచ్‌ల కింద చిక్కుకుపోయి.. ఇరుక్కుపోయి.. కాళ్లు, చేతులు తెగి.. కాపాడాలంటూ హృదయవిదారకంగా వారు చేస్తున్న ఆర్తనాదాలు.. చెల్లాచెదురుగా పడిన బోగీలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. సహాయకచర్యలకు చీకటి అడ్డంకిగా మారింది. వారిని ఆ బోగీల నుంచి తీసి ఆస్పత్రికి తరలించడం కష్టంగా మారింది. రాత్రంతా సహాయక చర్యలు కొనసాగాయి. శనివారం ఉదయం వరకూ మృతుల సంఖ్య 233కు చేరుకోగా.. 900 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాగా.. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌లలో ఏది తొలుత పట్టాలు తప్పి ప్రమాదానికి గురైందనే విషయంపై రెండు రకాల కథనాలు వినిపించాయి. తొలుత కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్‌ను ఢీకొన్నట్టు వార్తలు వచ్చాయి. కానీ.. తొలుత పట్టాలు తప్పింది బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్సేనంటూ పీటీఐ వార్తాసంస్థ పేర్కొంది. కానీ.. మొదట పట్టాలు తప్పింది కోరమాండలేనని రైల్వే అధికార ప్రతినిధి అమితాభ్ శర్మ స్పష్టం చేశారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద ఘటన తీవ్ర విషాదం నింపింది.రైల్వే అధికారులు, ఆర్మీ సైన్యం సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదంపై ప్రధాని మోడీ,

2వ పేజీలో...

### రైల్వే ప్రమాదంపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష

ఘటనాస్థలిలో రైల్వే మంత్రి అశ్విన్

హాయకచర్యలను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి



**న్యూఢిల్లీ/బాలాసోర్,జూన్3(సమ సమాజం):** రైలు ప్రమాదంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సమీక్షించారు. పరిస్థితిని స్వయంగా సమీక్షించేందుకు, సహాయ

3

### రైలు ప్రమాద ఘటనపై సోనియా విచారం


అధీర్ రంజన్‌ను ఘటనా స్థలికి వెళ్లాలని ఆదేశం



**న్యూఢిల్లీ ,జూన్3(సమ సమాజం):** ఒడిశా లోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటనపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తీవ్ర విచారం వ్యక్తం చేశాయి. ఇది చాలా దురదృష్టకర ఘటన అని

3

### ఒడిశా రైలు ప్రమాదంపై కెటిఆర్ దిగ్భ్రాంతి



**హైదరాబాద్,జూన్3(సమ సమాజం):** ఒడిశా రైలు ప్రమాద ఘటనపై తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆ దుర్ఘటనలో 250మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఆయన సంతాపం

2

### రైలు ప్రమాద ఘటనపై సిఎం జగన్ దిగ్భ్రాంతి

ఉన్నతాధికారులతో ప్రమాదంపై సమీక్ష

ఘటనాస్థలికి మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలో ముగ్గురు అధికారుల బృందం

అవసరమైన సహాయక చర్యలకు సిద్ధం కావాలని ఆదేశం



**అమరావతి,జూన్3(సమ సమాజం):** ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై

3

## రైతుకు గౌరవం తెచ్చింది కెసిఆర్ మాత్రమే

తెలంగాణ వచ్చాకనే రైతు ఆత్మహత్యలు లేవు

రైతు దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత



**కామారెడ్డి,జూన్3(సమ సమాజం):** రాష్ట్రంలోని రైతులకు మర్యాద తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం

3

## పదేళ్ల తెలంగాణలో అప్పులు, ఆత్మహత్యలు

కమీషన్లు, కబ్జాల దందాలతో దేశనవ్వుకుంటోంది

కెసిఆర్ ప్రసంగంపై షర్మిల విసుర్లు



**హైదరాబాద్,జూన్3(సమ సమాజం):** పదేండ్లలో సీఎం కేసీఆర్ సాధించింది అప్పులు, ఆత్మహత్యలు, కమీషన్లేనని వైఎస్ఆర్టీపీ చీఫ్ వైఎస్

3

### ప్రమాదంతో పలు రైళ్లు రద్దు



**హైదరాబాద్, జూన్3(సమ సమాజం):** ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. పశ్చిమబెంగాల్‌లోని షాలిమార్ నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు ప్రయాణిస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841) శుక్రవారం రాత్రి 7.20 గంటల సమయంలో పట్టాలు తప్పి గూడ్స్ రైలును ఢీకొంది. దాదాపు 15 కోచ్‌లు పట్టాలు

2

### కెసిఆర్‌ను ఇక సాగనంపుదాం

కాంగ్రెస్‌తోనూ తెలంగాణకు విముక్తి

న్యూజెర్సీలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్3(సమ సమాజం):** న్యూజెర్సీలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. కేసీఆర్ దోపిడీని ఇంకా

3

### రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో రచ్చ

కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతల యత్నం

**మెదక్, జూన్3(సమ సమాజం):** నర్సాపూర్ రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో రచ్చ జరిగింది. ధాన్యం కొనుగోలు కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే తెలంగాణ దశాబ్ది వారోత్సవాలు ఎందుకని బీఆర్ఎస్ నాయకులను స్థానిక కాంగ్రెస్ నేతలు నిలదీసారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రైతు వేదిక కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు

2

### రైల్వేగేటు మరచిన గేట్‌మెన్

తృటిలో తప్పిన ప్రమాదం

**పుట్టపర్తి, జూన్3(సమ సమాజం):** సత్యసాయి జిల్లా కదిరి రైల్వే గేట్ దగ్గర రైలు ప్రమాదం తప్పింది. నాగర్ కోయిల్ - ముంబై రైలు వచ్చే సమయంలో కూటగుల్ల దగ్గర గేట్ మెన్ గేట్ వేయలేదు. వాహనాలు గేట్ దాటుతుండగా గమనించిన లోకో పైలెట్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో రైలు గేట్ దాకా రాకముందే ఆగిపోయింది. దీంతో ఒక్కసారిగా

2

### బోరుబావిలో పడ్డ బాలిక

గుజరాత్ జామ్‌నగర్ జిల్లాలో ఘటన

**గాంధీనగర్,జూన్3(సమ సమాజం):** గుజరాత్‌లోని జామ్‌నగర్ జిల్లాలో వ్యవసాయ పొలంలో రెండేళ్ల బాలిక బోరుబావిలో పడి 20 అడుగుల లోతులో ఇరుక్కుపోయింది. చిన్నారి ఆ ప్రాంతంలో ఆడుకుంటుండగా గుంతలో పడినట్టు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం స్థానిక అధికారులు చిన్నారిని రక్షించే పనిలో నిమగ్నమయ్యారు. జామ్‌నగర్ నగరానికి 40 కిలోమీటర్ల దూరంలోని తమచన్ గ్రామంలోని

2

# సంపాదకీయం

## మెడల్స్ గంగలో విసిరేసినా చలనం రాదేమో..!

మహిళలకు అండదండలు లేవని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరోమారు నిరూపించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా దేశ కీర్తిపతాకన ఎగురేసిన మహిళా రెజ్లర్ల విషయంలో అనుసరిస్తున్న వైఖరి మోడీ లేదా బిజెపి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చూడాలి. తప్పు ఎవరిదైనా ఓ బిజెపి ఎంపి తమపట్ల అసభ్యంగా ప్రవర్తిం చాడని, లైంగిక వేధింపులకు గురి చేశాడని ఎలుగెత్తి నెత్తీ నోరు మొత్తుకుంటున్నా..చీమకుట్టినట్లు కూడా లేదు. కనీసం మహిళా ఎంపిలు కూడా వారిపట్ల సానుభూతి చూపడం లేదు. నిజానికి ఇది చిన్న సమస్య కాదు. దేశం తలదించుకునే సమస్య. తమ పతకాలను గంగలో విసిరి పారేస్తామన్నా ప్రభుత్వంలో చలనం కానరావడం లేదంటే..ఇంతకన్నా అవమానం మరోటి ఉండబోదు. బిజెపి ఎంపి బ్రిజ్‌మోహన్ ఇక్కడ దోషి. ఆయన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు కావడమే అసలు సమస్య. ఈ విషయంలో రెజర్ల ఆరోపణల్లో నిజానిజాలు వెలికి తీయాలి. కానీ అలా జగరడం లేదు. కనీసం వారిని చర్చలకు పిలిచి..సానుకూలతను వ్యక్తం చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బరితెగించిన పాలనకు ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. నెలల తరబడి మహిళలు ఆందోళన చేస్తుంటే చేష్టలుడిగిన పాలకులు, ఎంపిలు ఢిల్లీలో చోద్యం చూస్తున్నారు. మహిళా మంత్రులుగా ఉన్న నిర్మలా సీతారామన్,స్మృతి ఇరానీ లాంటి వారంతా వారిని కలసి సమస్య గురించి ఆరాతీసి వుంటే గగౌరవం పెరిగేది. కానీ అలా జరగలేదు. బేటీపడావో..బేటీ బచావో అంటున్న మోడీ కూడా ఈ సమస్యను చిన్నదిగానే చూశారు. ఇంతకన్నా రాక్షసత్వం మరోటి ఉండదు. మహిళా రెజ్లర్లను పిలిచి ముందుగా వారు ఆందోళన విరమించేలా చేసి... నిజానిజాలు వెలికితీసివుంటే ప్రభుత్వ సచ్ఛీలత బయటపడేది. ఇకపోతే వారికి అన్ని వర్గాల నుంచి క్రమంగా మద్దతు పెరుగుతోంది. తాజాగా క్రికెటర్లు కూడా పూర్తి మద్దతు ప్రకటించారు. ఇకపోతే ఇటీవల పార్లమెంట్ ప్రారంభోత్వసం సందర్భంగా వారు ఆందోళనకు దిగి తమ సయస్య తీవ్రతను తెలియచేసే ప్రయత్నం చేశారు. అయితే మహిళా రెజ్లర్లపై రాజధాని ఢిల్లీ వీధుల్లో పోలీసుల కిరాతకం బిజెపి ప్రభుత్వ నిరంకుశానికి పరాకాష్టగా నిలచింది. మన ప్రజాస్వామ్యానికి దేవాల యంగా అభివర్ణించే నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవం రోజున రెజ్లర్లపై దమనకాండకు దిగింది. తమను లైంగికంగా, మానసికంగా వేధించిన బిజెపి పార్లమెంట్ సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోమనడమే రెజ్లర్లు చేసిన నేరం. బ్రిజ్ భూషణ్‌పై చర్యల కోసం ఐదు వారాలుగా ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లు సత్యాగ్రహ దీక్ష చేస్తున్నారు. మోడీ సర్కారు స్పందించక పోవడంతో నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంనాడు 'మహిళా మహా పంచాయత్'కు పిలుపు నిచ్చారు. పార్లమెంట్‌కు మార్చ్‌గా వెళుతున్న రెజ్లర్లను పోలీసులు బలవంతంగా అడ్డుకొని మహిళలని కూడా చూడకుండా రోడ్లపై ఈడ్చిపారేశారు. ఎక్కడికక్కడ బస్సుల్లోకి ఎత్తిపడేసి వాహనాల్లో కుక్కి పోలీస్ స్టేషన్లకు తిప్పారు. అరెస్టులు చేసి..అక్రమ కేసులు బనాయించారు. బిజెపి ప్రభుత్వ పైశాచికంపై వినేశ్ ఫొగాట్ వంటి వారు కన్నీరు పెట్టుకున్నారు. రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా నిలిచిన ప్రజాసంఘాలకు చెందిన మహిళా నేతలను,రైతు నాయకులను ఢిల్లీ సరిహద్దులు మూసేసి మరీ అడ్డుకున్నారు.ఇంతకన్నా దారుణం.. దౌర్భాగ్యం మరోటి ఉండదు. ఆందోళన చేయడమే నేరమన్నట్లుగా పరిస్థితి కనిపించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షునిగా ఉన్న సమయంలో బ్రిజ్ భూషణ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారన్న అభియోగం విషయంలో వారు గట్టిగానే నిలబడ్డారు. అటువంటి ఆరోపణలొచ్చిన వెంటనే బాధ్యత గల ప్రభుత్వమేదైనా దర్యాప్తు చేసి నిందితుడిని శిక్షించాల్సింది. కానీ అలా జరగలేదు. తమకు న్యాయం చేయాలని ఏప్రిల్ 23 నుంచి రెజ్లర్లు ఢిల్లీలో ఆందోళన చేస్తున్నారు.

ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పట్టించు కోవడంలేదని వారి ఆందోళనలు చూస్తే అర్థం అవుతోంది. దేశానికి పతకాలు సాధించిన క్రీడాకారులు రోడ్డున పడ్డారన్న బాధ ఏ కోశాన కనిపించడం లేదు. రెజ్లర్ల పోరాటానికి వివిధ వర్గాల నుంచి క్రమేపి మద్దతు పెరుగుతోంది. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలంటూ 1,150 మందికి పైగా మేధావులు ప్రధానికి లేఖ రాశారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా రైతులు నిర్వహించిన వీరోచిత పోరాటం మాదిరి రెజ్లర్ల ఆందోళన రూపుదిద్దుకుంటోంది. ఎంతగా నిర్బంధం అమలు చేసినా తమ పోరాటం ఆగదని రెజ్లర్లు ప్రకటించి మొక్కవోని దీక్ష కనబర్చడం కంటనీరు పెట్టిస్తోంది. ప్రజాస్వామ్యం, మహిళలు, గగౌరవం, భారత సంస్కృతీ సంప్రదాయాల గగురించి గొప్పలు చెబుతున్న ప్రధాని మోడీవన్నీ వాగాడంబరాలే అని తేలింది. మహిళా రెజ్లర్లపై పోలీస్ దౌర్జన్య కాండకు తోడు.. బిజెపి ఎంపి పట్ల చర్యలు తీసుకునే ప్రయత్నం కానరావడం లేదు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు రాజ్యాంగం పౌరులకు కల్పించింది. భావ ప్రకటనా స్వేచ్ఛ ఇచ్చింది. మహిళా రెజ్లర్లు తమను వేధించిన ఎంపి.ని అరెస్టు చేయమంటుండగా, నిందితుడిని వెనకేసుకుని వస్తున్న బిజెపి ఇక మహిళలకు న్యాయం చేస్తుందని అనుకోవడం భ్రమ. రెజ్లర్లను లైంగికంగా వేధించే హక్కు బ్రిజ్ భూషణ్‌కు దఖలు పర్చినట్లుగా ఉందా అనుమానాలు కలుగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరంకుశత్వం చెల్లదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపి బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజాస్వామ్యం గురించి మోడీ గొప్పలు చెప్పడం మాని అసలు నిజాలు కనుక్కోవాలి. మరోవైపు డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరన్ సింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ రెజ్లర్ల చేస్తోన్న ఆందోళనకు క్రమంగా అన్ని వర్గాల మద్దతు లభిస్తోంది. ఇప్పటికే ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) రెజ్లర్లకు అండగా నిలవగా, తాజాగా 1983 వరల్డ్ కప్ హీరోస్ టీం కూడా వారికి మద్దతు తెలిపింది. ఢిల్లీ వేదికగా గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న భారత మహిళా రెజ్లర్లకు 1983లో క్రికెట్ వరల్డ్‌కప్ గెలిచిన జట్టు మద్దతు ప్రకటించింది. ఢిల్లీలో భారతదేశపు ఛాంపియన్‌లు అయిన మహిళా రెజ్లర్లను మ్యాన్ హ్యాండిల్ చేసిన తీరును చూసి మేం చాలా వేదనకు, వ్యాకులతకు గురయ్యాం. ఎంతో కష్టపడి సాధించిన పతకాలను వారు గంగానదిలో పడే యాలనే ఆలోచనకు రావడం ఎంతో బాధపెట్టింది. ఎందుకంటే ఆ పతకాల్లో ఏళ్ల తరబడి చేసిన శ్రమ, త్యాగం, సంకల్పం దాగి ఉంటుంది. అంతేగాక వారు గెలిచిన పతకాలు వారికే కాదు, దేశానికే గర్వకా రణం. ఈ విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని వారు రెజ్లర్లను కోరుతూనే...తమ పూర్తిస్థాయి మద్దతు ప్రకటించారు. నిజానికి ఇప్పటికే ఆలస్యం అయ్యింది. ఇకనైనా ఉపేక్ష లేకుండా ప్రభుత్వం చర్యలకు దిగాలి. రెజ్లర్లకు స్వాంతన చేకూర్చాలి.

# ఒడిశా రైలు ప్రమాదంనై ఉన్నతస్థాయి దర్యాప్తు

- సహాయక చర్యలను పర్యవేక్షించిన రైల్వే మంత్రి
- తక్షణ సాయం ప్రకటన...ఘటనపై ఆరా తీస్తున్నాం
- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన



**భువనేశ్వర్, జూన్3(సమ సమాజం):** ఒడిశాలో మూడు రైళ్లు ప్రమాదానికి గురికావడంపై అత్యున్నత స్థాయి దర్యాప్తు నిర్వహిస్తామని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం చెప్పారు. సహాయక చర్యలపైనే తాము ముఖ్యంగా దృష్టి సారించామని, బాధితులకు వైద్య సహాయం అందించడమే తమ మొదటి కర్తవ్యమని చెప్పారు. భారతీయ రైల్వేలు విడుదల చేసిన ప్రకటనలో, ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు జరుగుతుందని తెలిపింది. సౌత్ ఈస్ట్ సర్కిల్ రైల్వే భద్రతా కమిషనర్ ఏఎం చౌదరి నేతృత్వంలో ఈ స్వతంత్ర దర్యాప్తు జరుగుతుందని తెలిపింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం మీడియాతో మాట్లాడుతూ, జాతీయ విపత్తు స్పందన దళం బృందాలకు ధన్యవాదాలు తెలిపారు. బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టి, చురుగ్గా సహాయపడుతున్నందుకు ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో మాట్లాడారు. సహాయక చర్యలపైనే తాము ముఖ్యంగా దృష్టి సారించామని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం నుంచి అనుమతి వచ్చిన తర్వాత పునరుద్ధరణ చర్యలు ప్రారంభమవుతాయని చెప్పారు. అత్యున్నత స్థాయి దర్యాప్తు నిర్వహిస్తామని, అదేవిధంగా రైల్వే భద్రతా కమిషనర్ స్వతంత్ర దర్యాప్తు చేస్తారని తెలిపారు. అంతకుముందు ఆయన ప్రమాదానికి గురైన రైలు బోగీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంఘటనా స్థలంలో అన్ని వైపులా నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. ఇది అత్యంత దారుణ, విషాదకర దుర్ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. బాధితులకు సాధ్యమైనంత అత్యుత్తమ వైద్య సేవలను అందజేస్తామని చెప్పారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారాన్ని శుక్రవారం ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం అనుమతి వచ్చిన తర్వాత పునరుద్ధరణ చర్యలు ప్రారంభమవుతాయన్నారు. ప్రయాణికుల కోసం గాలింపు, సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్న ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రమాదంలో 280 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. సుమారు 900 మంది గాయపడినట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు రూ.2 లక్షలు చొప్పున, స్వల్పంగా గాయపడినవారికి రూ.50,000 చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు భారతీయ రైల్వేలు ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దారుణంపై తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బాధితులకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుంచి సహాయాన్ని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, గాయపడినవారికి రూ.50,000 చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పశ్చిమ బెంగాల్ పర్యటనను అర్ధాంతరంగా ముగించుకుని బాలాసోర్‌కు బయల్దేరారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ శనివారం సంఘటన స్థలానికి చేరుకుంటారని టీఎంసీ ఎంపీ డోలా సేన్ చెప్పారు. సహాయక చర్యల్లో పాలుపంచుకోవడం కోసం ఖరగ్‌పూర్ నుంచి అధికారులను ఆమె పంపించారని చెప్పారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లా, బహంగా బజార్ స్టేషన్ సమీపంలో శుక్రవారం సాయంత్రం 6.55 గంటల నుంచి 7 గంటల మధ్యలో ఈ దారుణం జరిగింది. బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మొదట పట్టాలు తప్పినట్లు తెలుస్తోంది. ఈ రైలు బోగీలు పక్కనే ఉన్న పట్టాలపై పడ్డాయని, ఆ తర్వాత షాలిమార్-చెన్నై కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి, బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌పై పడిందని, అంతేకాకుండా ఆ పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ గూడ్స్ రైలుపై పడిందని తెలుస్తోంది. ఇదంతా కేవలం 5 నిమిషాల వ్యవధిలోనే జరిగిందని చెప్తున్నారు. కోల్‌కతాకు దక్షిణ దిశలో 250 కిలోమీటర్ల దూరంలో, భువనేశ్వర్‌కు ఉత్తర దిశలో 170 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరిగింది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడానికి కారణాలేమిటో ఇంత వరకు తెలియడం లేదు.

## రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో రచ్చ

(మొదటి పేజీ తరువాయి) చేరుకున్నారు. రోడ్డుపై బైఠాయించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఖా నాయకులు.. కేసీఆర్ జిందాబాద్ అంటూ..కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ డౌన్ డౌన్ అంటూ బాహాబాహి నినాదాలు చేసుకున్నారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# బోరుబావిలో పడ్డ బాలిక

(మొదటి పేజీ తరువాయి) పొలంలో కూలీలుగా పనిచేస్తున్న గిరిజన కుటుంబానికి చెందిన చిన్నారి ఆడుకుంటూ దాదాపు 200 అడుగుల లోతున్న బోరుబావిలో పడిపోయిందని జామ్‌నగర్ తాలూకా అభివృద్ధి అధికారి ఎన్ఎ సర్వయ్య తెలిపారు. ఈ ఘటన ఉదయం 9 గంటల ప్రాంతంలో జరిగిందని ఆయన తెలిపారు. 'మేము జామ్‌నగర్ నుంచి అగ్నిమాపక శాఖ సిబ్బందిని కలుపుకొని ఉదయం 11 గంటలకు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించాము. బాలిక దాదాపు 20 అడుగుల లోతులో ఇరుక్కుపోయింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సర్వయ్య చెప్పారు.

## ప్రమాదంతో పలు రైళ్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి) తప్పగా.. వాటిలో ఏడు తిరగబడిపోయాయి. రైలు ప్రమాదం కారణంగా నేడు, రేపు పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. మరి కొన్ని రైళ్లను దారి మళ్లించింది.



## రాబోయే నాలుగు రోజుల్లో వర్షాలు

ఉరుములు,మెరుపులతో కూడిన వానలు

**హైదరాబాద్, జూన్3(సమ సమాజం):** రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదివారం, సోమవారం రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతాయని హెచ్చరించి, ఎల్లో అలర్ట్ జారీ చేసింది.రాగల 24 గంటలు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని తెలిపింది. పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 28 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. వాయవ్యం, పడమర దిశల నుంచి వీస్తున్న గాలులతో రాష్ట్రంలో ఎండలు, వడగాల్పులు పెరిగాయి. ఉదయం 7 గంటల నుంచే వేడిగాలులు మొదలై, మధ్యాహ్నం తీవ్రం అవుతున్నాయి. శుక్రవారం అన్ని జిల్లాల్లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి.

## రైల్వేగేటు మరచిన గేట్‌మెన్

(మొదటి పేజీ తరువాయి) వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. లేకపోతే మరో ఘోర ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తం చేశారు. గేట్ మేన్ నిర్లక్ష్యంపై అధికారులు విచారణ చేయగా చివరకు హాస్పటల్ కనిపించాడు. తనకు యాక్సిడెంట్ అయ్యిందంటూ బుకాయించాడు.

## ఒడిశా రైలు ప్రమాదంపై కెటీఆర్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి) తెలిపారు. ప్రమాద బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. రైలు ప్రమాదాన్ని నివారించే యాంటీ కొలిజన్ డివైస్‌లు ఏమైనట్లు మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ప్రమాద తీవ్రత చాలా ఊహించని రీతిలో ఉందని, ఈ విషాదం జరగాల్సింది కాదు అని ఆయన తన ట్విట్టర్‌లో తెలిపారు.

# దేశంలోనే రైతులకు ఆదర్శంగా తెలంగాణ

రైతు దినోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్



**వరంగల్, జూన్3(సమ సమాజం):** దేశంలో ఎవరూ చేయని విధంగా రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూ వ్యవసాయాన్ని దండుగ కాదు పండుగ అని ముఖ్యమంత్రి కేసీఆర్ నిరూపించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం దశాబ్ది వేడుకల రెండో రోజు వరంగల్ ఉమ్మడి జిల్లాలో రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. ఎనుమాముల మార్కెట్, పరకాల నియోజకవర్గం గవిచర్ల, పాలకుర్తి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని రైతు సభల్లో మాట్లాడారు. రైతులకు ఎదురుపెట్టుబడి ఇస్తున్న ప్రభుత్వం మరెక్కడా లేదని గుర్తుచేశారు. రుణమాఫీ చేయడంతో పాటు సమృద్ధిగా నీరు, అందుబాటులో విత్తనాలు, ఎరువులు, 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతుల భూములకు భద్రత కల్పిస్తూ, ధరణి పోర్టల్ తీసుకొచ్చారని వెల్లడించారు. రైతు వేదికలు, రైతు కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర కల్పించి, పంటల నష్టాలకు ఎకరానికి రూ 10 వేల పరిహారం ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతును రాజుగా చేయడానికి సీఎం కేసీఆర్ కష్టపడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రైతాంగం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత పరిస్థితిని రైతులు బేరీజు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ్యులు నన్నపునేని నరేందర్, ఆరూరి రమేష్, జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, సీపీ ఏవీ రంగనాథ్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒడిశా రైలు ప్రమాదం

## మృతుల సంఖ్య 238కి చేరిక

(మొదటి పేజీ తరువాయి) రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి ప్రకటించారు. రాష్ట్ర వేడుకలను రద్దు చేసిన ఒడిశా సర్కార్ ..ఒక రోజు సంతాప దినంగా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. ఒడిశా రైలు ప్రమాదం జరిగిన స్థలం దగ్గరకు సీఎం నవీన్ పట్నాయక్ చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. ఘటనా స్థలంలో ఎక్కడ చూసినా మృతదేహాలు కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. ఎంతో మంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నా బోగీల కింద చిక్కుకున్న చాలా మంది బాధితులు సాయం కోసం ఆర్తిస్తున్నారు. 7 ఎన్డీఆర్ఎఫ్, 5 ఓడీఆర్ఎఫ్, 24 ÷ర్ సర్వీస్ యూనిట్స్ ,లోకల్ పోలీసులు,వాలంటీర్లు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ప్రమాదంలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరందరికీ రక్తం అవసరం ఉందని తెలిసి చాలా మంది రక్తదానం చేసేందుకు భద్రక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి క్యూ కట్టారు. క్యూలో నిలబడి రక్తదానం చేస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒడిశా రైలు ప్రమాదంలో వందలాది మంది కొద్దీ ప్రాణాలు కోల్పోవడం పట్ల నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ సంతాపం తెలిపారు. 'ఈరోజు భారతదేశంలోని ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పరిశీలిస్తున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైలు ప్రమాద ఘటన చాలా బాధాకరమన్నారు. ప్రస్తుతం సహాయక చర్యలపై ఫోకస్ పెట్టామని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. దర్యాప్తుకు హైలెవర్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. విచారణ తర్వాతే ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయన్నారు.



## నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నెల్లూరు,జూన్3(సమ సమాజం):** ఒడిషా రైల్ ప్రమాద ఘటన పై నెల్లూరు కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0861- 2331261 ను ఏర్పాటు చేశారు.ప్రమాదం జరిగిన ట్రైన్ లో నెల్లూరు జిల్లాకు సంబదించిన వారు ఎవరైనా వుంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామ , వార్డ్ సచివాలయాల సిబ్బంది, వి.ఆర్.ఓ లు,వాలంటీర్లు ద్వారా సమాచారం సేకరించాలని ఆర్డీవోలు, తహశీల్దార్ లకు కలెక్టర్‌హరి నారాయణన్ ఆదేశాలు జారీ చేశారు.

# రైల్వే ప్రమాదంపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష



(మొదటి పేజీ తరువాయి) కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ప్రమాద స్థలానికి బయలుదేరారు. మొదట ప్రమాద స్థలాన్ని సందర్శించి, ఆ తర్వాత కటక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శిస్తారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో 233 మంది చనిపోగా 900మందికిగా పైగా గాయాలయ్యాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రధాని మోడీ, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఇదిలావుంటే ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన రైలు ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి శనివారం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేరుకుని అక్కడి పరిస్థితులపై ఆ జిల్లా యంత్రాగంతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రైలు ప్రమాదంపై విచారణ జరిపేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించాము. రైల్వే సేఫ్టీ కమిషనర్‌ని పిలిపించి, ఆయనతో కూడా విచారణ జరిపి ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం దృష్టి అంతా రెస్క్యూ ఆపరేషన్, గాయపడిన వారికి చికిత్స చేయడం పైనే ఉందన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము. నిన్న రాత్రి నుంచి రైల్వే జాతీయ విపత్తు దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర ప్రభుత్వ బృందాలు సహాయక చర్యల్లో నిమగమై ఉన్నాయని ఆయన అన్నారు. ఈ పెను విషాదానికి సంబంధించి ప్రతిపక్షాలు రైల్వే మంత్రిని తన పదవికి రాజీనామా చేయాలని పట్టుబడుతున్నాయని మీడియా ప్రతినిధులు అశ్విని వైష్ణవ్‌ని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానంగా.. 'ప్రస్తుతం నా దృష్టి అంతా రెస్క్యూ రిలీఫ్‌పై పెట్టాలి.' అని అశ్విని వైష్ణవ్ బదులిచ్చారు. జిల్లా యంత్రాంగం క్లియరెన్స్ ఇచ్చిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని ఆయన అన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ పూర్తయిన తర్వాతే తెలుస్తుంది అని బాలసోర్ కలెక్టర్ మీడియా ప్రతినిధులకు తెలిపారు.

# కెసిఆర్‌ను ఇక సాగనంపుదాం




(మొదటి పేజీ తరువాయి) ఎంతకాలం భరిద్దాం... తెలంగాణ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి అంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ విజయంతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాలు ఎంతో శ్రమించి పోరాటాలు, త్యాగాలు చేసి రాష్టాన్ని ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. అయితే ఒక్క కేసీఆర్ (÷ṇ÷జీనిణజీనిజీ అఓ ఐఅఖీ) కుటుంబమే పదేళ్లుగా రాష్టాన్ని పాలిస్తూ అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాజకీయాలను అవినీతిమయం చేశారని మండిపడ్డారు. ఇక్కడ అమెరికాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరగడం, అందులో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమెరికలో ఉన్న తెలంగాణ వాళ్ళు మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. తెలంగాణలో 9 ఏళ్ల పాలనలో కేసీఆర్ 5 లక్షల కోట్ల అప్పు చేశారని తెలిపారు. రూ.17 లక్షల కోట్లు బ్జడెట్ ద్వారా వచ్చిందని.. రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేసినా కూడా తెలంగాణ ప్రజల సగటు జీవితంలో ఎలాంటి మార్పులు రాలేదని విమర్శించారు. కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం పోరాటం చేశామంటూ చెప్పిన టీఆర్ఎస్‌కు ప్రజలు రెండు సార్లు అవకాశం ఇచ్చారని.. కానీ కేసీఆర్ ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలన చెయ్యలేదని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కూడా తెలంగాణ ప్రజలు ఆదరించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలు ఆశలు, ఆశయాలు నెరవేరుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అకసమాత్తుగా చెలరేగిన మంటలు

### స్కార్పియో వాహనం దగ్ధం

**నిజామాబాద్, జూన్3(సమ సమాజం):** అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఓ స్కార్పియో వాహనం దగ్ధమైంది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఎడపల్లి మండలం జాన్కంపేట్ నుండి నిజామాబాద్ వెళు ండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో నుంచి పొగలు రావడం గమనించిన ప్రయాణికులు వెంటనే కిందగి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం కొద్దిసేపటికే మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇదిలావుంటే, దేశంలో ఎండలు భగభగా మండిపోతున్నాయి. ఈ సమయంలో కార్లలో ప్రయాణించే వారు చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన సమయంలో వాహనాన్ని కాసేపు ఆపి మరలా ప్రయాణించండి. అలాగే ఎక్కువ సేపు ఎండలో పార్క్ చేసి ఉంచకండి.

# రైలు ప్రమాద ఘటనపై సోనియా విచారం



(మొదటి పేజీ తరువాయి) అన్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తననెంతో కలిచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. కాగా, ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితిని తెలుసుకోవాలని, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంస్థలు చేస్తున్న సహాయక కార్యక్రమాలను సమీక్షించాలని లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరిని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆదేశించారు. బాలాసోర్ రైలు ప్రమాద ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోవడంపై కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మొదట్నించీ తాను చెబుతూనే ఉన్నానని ఉన్నారు. 'బుల్లెట్ ట్రైన్ల కారణంగా ఎక్కువ మొత్తాన్ని దానికి ఖర్చు చేస్తున్నారు. వందే భారత్ రైళ్ల గురించి ప్రతి రోజూ చెబుతున్నారు. రోజూ 25 లక్షల మంది రైళ్లలో ప్రయాణిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అది చాలా పెద్ద తప్పిదం అవుతుంది. రైళ్లు ఢీకొనకుండా 'యాంటీ డివైస్'ల గురించి చాలా గొప్పగా చెబుతున్నారు. ఆ పరికరాలు ఏవని, మూడు రైళ్లు ఢీకొన్నాయని అధీర్ రంజన్ చౌదరి సూటిగా ప్రశ్నించారు.

# రైలు ప్రమాద ఘటనపై సిఎం జగన్ దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి) ముఖ్యమంత్రి వైయస్.జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో 280 మందికిపైగా చనిపోయారని తాజా సమాచారం. దీనిపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతులు, క్షతగాత్రుల్లో రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఉన్నారా? లేదా? అన్నదానిపై దృష్టిపెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. రైల్వే అధికారులతో నిరంతరం టచ్‌లో ఉన్నామని అధికారులు సీఎంకు తెలిపారు. ఎలాంటి సహాయం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు. రైల్వే అధికారులనుంచి నిరంతరం సమాచారం తెప్పించుకోవాలన్నారు. ఈ క్రమంలోప్రమాద ఘటనపై సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. ఘటనా స్థలానికి మంత్రి అమర్‌నాథ్ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్‌ల బృందం వెళ్లాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఎంక్వైరీ విభాగాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరమైన పక్షంలో ఘటనాస్థలానికి పంపించడానికి అంబులెన్స్‌లు సన్నద్ధం చేయాలన్నారు. ఎమర్జెన్సీ సేవలకోసం విశాఖ సహా ఒడిశా సరిహద్దు జిల్లాల్లో ఆస్పత్రులను సిద్ధం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చారు. సీఎంఓ కార్యాలయ అధికారులతో



కలిసి.. ఈ ప్రమాద ఘటనపై ఆయన సమీక్షించారు. తాజా సమాచారం ప్రకారం 237 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల సంఖ్యకూడా భారీగా ఉందని వివరించారు. సీఎం ఆదేశాలమేరకు తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. ప్రమాద ఘటన జరిగిన ప్రాంతం పరిధిలోని డీఆర్ఎం అధికారి నుంచి సమాచారం తెప్పిస్తున్నామని అధికారులు వెల్లడించారు. అలాగే ఒడిశా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో కూడా నిరంతరం టచ్‌లో ఉన్నామని వెల్లడించారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఒక బృందాన్ని ప్రమాదం జరిగిన బాలాసోర్ ప్రాంతానికి పంపించాలని సీఎం ఆదేశించారు. –మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు సివిల్ సప్లైస్ కమిషనర్ అరుణ్ కుమార్, విశాఖలో కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ ఆనంద్, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ నవీన్‌లతో కూడిన బృందం వెళ్తోందని అధికారులు తెలిపారు. ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో కూడా ఎంక్వైరీ విభాగాలను ఏర్పాటుచేయాలని సీఎం ఆదేశాలతో ఆమేరకు కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చామని అధికారులు తెలిపారు. – రైల్వే అధికారులనుంచి అందిన ప్రయాణికుల పరిస్థితులపై ఆరాతీయడానికి, అలాగే ఎవరైనా ప్రయాణికుల బంధువులు, వారి సంబంధీకుల నుంచి సమాచారం వస్తే వెంటనే స్పందించేలా ఈ ఎంక్వైరీ విభాగాలు పనిచేయాలని సీఎం ఆదేశించారు. – దీంతో పాటు ఒడిశా సరిహద్దులకు సమీపంగా ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల్లో అవసరమైన పక్షంలో అంబులెన్స్‌లు పంపించడానికి సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు.– క్షతగాత్రులకు అవసరమైన పక్షంలో ఉత్తమ వైద్యం అందించడానికి విశాఖ సహా ఒడిశా సరిహద్దుల్లోని ఆస్పత్రులను సన్నద్ధంగా ఉంచాలని కూడా సీఎం అధికారులను ఆదేశించారు. – ప్రమాద ఘటనకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు.

## సైకిల్ తొక్కడం ఆరోగ్యకరం...

### డాక్టర్ జి. సమరం


**విజయవాడ, జూన్3(సమ సమాజం):** శారీరక శ్రమ లేకపోవడం వలన శరీరం ఎన్నో వ్యాధులకు గురువుతోందని ప్రముఖ వైద్యులు జి. సమరం అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వారం జరిగిన ప్రపంచ సైకిల్ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శరీరంలోని మొత్తం అవయవాలు ఒకే సమయంలో కదలికల ద్వారా ఎముకలు, కండరాలు బలంగా తయారవుతాయన్నారు. సమాజపరంగా వస్తున్న మార్పులలో ఆహారం, జీవనశైలి, వృత్తి, వ్యాపార రీత్యా పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లు కూడా సైకిల్ తొక్కడం ద్వారా ఇటువంటి సమస్యలను అధిగమించవచ్చునన్నారు. నాలుగు దశాబ్దాల నాటికీ, ఇప్పటికీ వ్యాధుల పరంగా వచ్చిన మార్పులను ఆయన వివరించారు. కనీసం రోజులో ఒక గంట సేపు అయినా సైకిల్ తొక్కేలా ప్రతి ఒక్కరు సమయాన్ని సరిదిద్దుకోవాలని కోరారు. వ్యాయామం చేయడానికి సమయం లేనివారు దగ్గర ప్రాంతాలకు వెళ్లేందుకు సైకిల్ పై వెళ్లడం కూడా మంచి వ్యాయామంగా ఉంటుందన్నారు. ఔత్సాహిక సైకిలిస్టులతో సహా ఎన్ సి డి– సి డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ నాయక్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు, డిపిఎమ్ఓ డాక్టర్ నవీన్, డి పి ఓ డాక్టర్ మహేష్ తదితరులతోపాటు వైద్య ఆరోగ్య శాఖకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# పదేళ్ల తెలంగాణలో అప్పులు, ఆత్మహత్యలు

(మొదటి పేజీ తరువాయి) షర్మిల ఆరోపించారు. కేసీఆర్ ప్రసంగమంతా అబద్దాలమయం, అరచేతిలో వైకుంఠమని విమర్శించారు. రాష్ట్రాన్ని చూసి దేశం నివ్వెరపోతుందో లేదో తెలియదు కానీ కేసీఆర్ కమీషన్లు, కబ్జాలు, దందాలు చూసి దేశమే నవ్వుకుంటుందని చెప్పారు. రెండుసార్లు ప్రజలకు ఇచ్చిన హామీలను కేసీఆర్ నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.17 లక్షలకు పెరిగితే .. ఒక్కొక్కరి మీద రూ.1.50లక్షల అప్పు ఎందుకు ఉన్నట్లని షర్మిల ప్రశ్నించారు. 2014లో రూ.16వేల కోట్ల మిగులు బ్జడెట్ రాష్ట్రం.. 2023 నాటికి 5 లక్షల కోట్ల అప్పులకు ఎందుకు చేరుకున్నట్లని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను సొంత ప్రాజెక్టులుగా చెప్పుకోడానికి కేసీఆర్ కు సిగ్గుండాన్నారు. డిజైన్ మార్చి లక్ష కోట్లకు పెంచి లక్ష ఎకరాలకు నీళ్ళు ఇవ్వలేని కాళేశ్వరం కట్టి మోసం చేసిన చరిత్ర కేసీఆర్ దని విమర్శించారు. 10 ఏళ్లుగా కేసీఆర్ చేసింది లేదన్న షర్మిల... ఎన్నికల్లో ఓట్ల కోసం పోడు పట్టాలంటూ డ్రామాలాడుతున్నాడని ఆరోపించారు. గృహలక్ష్మి, లక్ష రుణం, గొర్రెలు, బర్రెలు, పనిముట్లు అంటూ కొత్త నాటకాలకు కేసీఆర్ తెరలేపాడని షర్మిల చెప్పారు. సంపద పెంచడం, ప్రజలకు పంచడం కాదు.. సంపద వెతకడం అమ్మడమే కేసీఆర్ సిద్దాంతమని వెల్లడించారు. ఉద్యమ తెలంగాణ .. ఉజ్వల తెలంగాణ కాలేదన్న షర్మిల.. ఉద్యమ తెలంగాణ మళ్ళీ ఉద్యమాల తెలంగాణగానే మారిందన్నారు. కేసీఆర్ పాలన అంతమైతేనే సంక్షేమ, స్వయం సమృద్ధి తెలంగాణ సాధ్యం కాదని షర్మిల తెలిపారు.

# రైతుకు గౌరవం తెచ్చింది కెసిఆర్ మాత్రమే


(మొదటి పేజీ తరువాయి) తెలంగాణ రాకముందు రైతుల ఆత్మహత్యలు ఉండేవి అని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు లేవని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు లేవు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని చెప్పారు. విత్తనాలు, ఎరువుల కొరత లేనే లేదు. కరెంట్ సమస్యలు కూడా లేవని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సదాశివనగర్ మండలం పద్మాజివాడలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకున్నామని కవిత పేర్కొన్నారు. దీంతో భూగర్భ జలాలు కూడా పెరిగాయన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వరిసాగులో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. రైతుల కోసం సంఘాలు పెట్టిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. రైతులు లాభదాయకమైన పంటలవైపు దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ సూచించారు. సరిహద్దు జవాన్.. పంట పొలంలో రైతు.. ఇద్దరి వల్లే మనం ప్రశాంతంగా జీవిస్తున్నాం అని కవిత పేర్కొన్నారు. రైతుకు మర్యాద తెచ్చిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. రైతు బంధు, రైతు బీమాతో అన్నదాతకు అండగా ఉన్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం అంటే దండగ అన్న స్థితి నుంచి పండగ అనే స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్రం రాక ముందు రైతు అంటే అప్పులు అడుగుతారని అనుకునేవారు.. కానీ కేసీఆర్ రైతులను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు అని కవిత పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు రైతు దినోత్సవ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని.. తెలంగాణ



ఏర్పడక ముందు రైతుల ఆత్మహత్యలు ఉండేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నకిలీ విత్తనాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నమన్నారు కవిత. ఫేక్ సీడ్స్ సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నామన్నారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగుచేసుకున్నామన్న ఆమె.. తెలంగాణ వచ్చాకే గ్రౌండ్ వాటర్ పెరిగిందన్నారు, కాళేశ్వరం 22 వ ప్యాకేజీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వరిసాగులో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో ఉందని .. తెలంగాణ రైతులు లాభదాయకమైన

# ఓవల్‌లో ముమ్మరంగగా టీమిండియా ప్రాక్టీస్

### హాట్ ఫేవరేట్ మన జట్టే అంటున్న రవిశాస్త్రి



లండన్, జూన్3(సమ సమాజం): :ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో రెండు రోజుల్లో ఇంగ్లండ్‌లో టెస్టు గద ఫైట్ షురూ కానుంది. మ్యాచ్ జరిగేది ఇంగ్లండ్‌లో కాబట్టి అందరూ ఆస్ట్రేలియానే ఫేవరెట్ అంటున్నారు. అయితే.. భారత మాజీ కోచ్ రవిశాస్త్రి మాత్రం ఆసీస్ విజయావకా శాల్ని కొట్టి పారేశాడు. ఫైనల్లో టీమిండియా గెలుస్తుందని, ఈసారి కచ్చితంగా ట్రోఫీ సాధిస్తుందని అన్నాడు. స్టార్లతో కూడిన భారత జట్టు కచ్చితంగా కప్పు కొడుతుందని చెప్పాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియా ఫేవరెట్ అని చాలామంది అంటున్నారు. ఎందుకంటే..? ఆడుతున్నది ఇంగ్లండ్‌లో కాబట్టి. కానీ, ÷నైల్ మ్యాచ్ ఒకే ఒక టెస్టు. ఫామ్‌లో ఉన్న భారత ఆటగాళ్లతో ఆసీస్‌కు కష్టమే. ÷నైల్లో విజయం ఆ జట్టుకు అంత సులువు కాదు' అని 1983 వరల్డ్ కప్ హీరో రవి శాస్త్రి తెలిపాడు. భారత జట్టుకు కోచ్‌గా పనిచేసిన అతడికి ఆటగాళ్ల గురించి బాగా తెలుసు. అతని ఆధ్వర్యంలోనే కోహ్లీ సేన ఇంగ్లండ్ పర్యటనలో సంచలనం సృష్టించింది. అంతేకాదు ఐసీసీ 2021లో తొలిసారి నిర్వహించిన టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరింది. 2011లో ఎంఎస్ ధోనీ సారథ్యంలో వరల్డ్ కప్ నెగ్గింది. ఆ తర్వాత ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా సాధించలేదు. భారత జట్టు ఒక ఐసీసీ ట్రోఫీ ఫైనల్లో గెలిచి ఇప్పటికీ 12 ఏళ్లు కావొస్తుంది. ఇంగ్లండ్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జూన్ 7 -11 తేదీల్లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ జరగనుంది. టెస్టు గద కోసం భారత్, ఆస్ట్రేలియా హోరాహోరీగా తలపడనున్నాయి. 2021లో ఫైల్ చేరిన భారత్ ఆఖరి మెట్టుపై భంగపడింది. విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమిండియా న్యూజిలాండ్ చేతిలో అనూహ్యంగా ఓటమి పాలైంది. దాంతో, టీమిండియా ఈసారి కప్పు కొట్టాలనే కసితో ఉంది.

# వావ్..లుక్ అదిరిందోచ్

## కొత్త జెర్సీలో క్రికెటర్లు

ముంబై, జూన్3(సమ సమాజం): రాబోయే ఐదేళ్ల కాలానికి భారత క్రికెట్ జట్లకు జెర్సీ స్పాన్సర్ చేసేందుకు అడిడాస్ సంస్థ బీసీసీఐతో ఒప్పందం చేసుకుంది. అందుకుగానూ అడిడాస్ సంస్థ బీసీసీఐకి రూ.350 కోట్లు చెల్లించనుంది. ఈ ఒప్పందం డబ్ల్యూటీసీ ఫైనల్ నుంచే అమల్లోకి రానుంది. ఇప్పటికే టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ కోసం ఇంగ్లండ్ చేరుకున్న భారత ఆటగాళ్లు అడిడాస్ కిట్లు ధరించి ప్రాక్టీస్ కూడా మొదలు పెట్టారు. తాజాగా, అడిడాస్ కంపెనీ క్రికెటర్ల కొత్త జెర్సీలను విడుదల చేసింది. ఈ సందర్భంగా భారత మెన్, విమెన్ క్రికెటర్లు వాటిని ధరించి సందడి చేశారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యాతో పాటు మహిళా క్రికెటర్లు హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన కొత్త జెర్సీలు ధరించి ఫోటోలకు పోజులి చ్చారు. అండర్-19 నుంచి భారత సీనియర్ జట్టు వరకు పురుషులు, మహిళా క్రికెటర్లు ఈ జెర్సీలను ధరించనున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరలవుతున్నాయి. ఈ జెర్సీలను క్షణ్ణంగా పరిశీలిస్తే.. వన్డే ఫార్మాట్‌లో ధరించే బ్లూ జెర్సీల భుజాలపై తెల్లటి స్ట్రిప్స్ వేశారు. అదే టెస్టు జెర్సీలను చూస్తే.. భుజాలపై బ్లూ స్ట్రిప్స్, ముందు భాగంలో ఇండియా పేరును కూడా బ్లూ కలర్‌తో ముద్రించారు. ఇక టీ20 ఫార్మాట్‌కు ఎప్పటిలానే రౌండ్‌నెక్ టీ షర్ట్ ను కొనసాగించారు. ఈ జెర్సీలు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అభిమానులు సైతం.. 'వావ్ అదిరింది లుక్..' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.




# ఒడిషా రైలు ప్రమాదం

## తీవ్ర దిగ్భ్రాంతికి గురైన క్రికెటర్లు




**ముంబై, జూన్3(సమ సమాజం):** ఒడిషాలోని బాలాసోర్‌లో చోటుచేసుకున్న రైలు ప్రమాదం దేశ వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మూడు రైళ్లు ఢీ కొన్న ఈ ఘటనలో 290 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. వెయ్యి మందికిపైగా గాయపడ్డారు. రైళ్లు అతివేగంతో ప్రయాణిస్తూ ఒకదాన్ని మరొకటి ఢీకొట్టడంతో.. కొన్ని బోగీలు గాల్లోకి లేచి, తిరిగిపోయాయి. అంతేబలంగా కిందికి పడిపోవడంతో ప్రయాణికులు వాటికింద నలిగిపోయారు. ఆ ప్రమాద దృశ్యాలు అందరినీ కలవరపరుస్తున్నాయి. ఈ విషాదకర ఘటనపై భారత క్రికెటర్లు ట్విట్టర్ వేదికగా స్పందించారు. రైళ్లు ఢీకొన్న ప్రమాదవార్త విని నేను చాలా బాధపడ్డాను. ఈ ప్రమాదంలో కుటుంబాలను కోల్పోయిన వారి చుట్టే నా ఆలోచనలు తిరుగుతున్నాయి. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా.. అని కోహ్లీ ట్వీట్ చేశాడు. ఒడిషా రైలు విషాద ఘటన నన్ను తీవ్ర దిగ్భాం÷-రతికి గురిచేసింది. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను..' అని రైనా ట్వీట్ చేశారు. బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాద దృశ్యాలు చూశాక నా హృదయం బద్దలైంది. ఈ ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను..' అని మయాంక్ ట్వీట్ చేశాడు. ఒడిశాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద దృశ్యాలు తీవ్రమైన వేదన కలిగిస్తున్నాయి. ఈ ప్రమాదంలో తమకు ఇష్టమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి..' అని సెహ్వాగ్ పోస్ట్ చేశారు.ఒడిశా రైలు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా..' అని యువరాజ్ ట్వీట్ చేశారు.

---




# గ్యాంగ్‌స్టర్ కథాంశంతో యానిమల్ మూవీ

**సందీప్ వంగా డైరెక్షన్‌లో రణ్‌బీర్ యాక్షన్**

అర్జున్ రెడ్డి డైరెక్టర్ సందీప్ వంగ తెలుగులో ఆ ఒక్క సినిమాతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయి బాలీవుడ్ కి వెళ్లిపోయాడు. ఇదే సినిమాని బాలీవుడ్ లో కబీర్ సింగ్ పేరుతో రీమేక్ చేసి అక్కడ కూడా స్టార్ డైరెక్టర్ అయిపోయాడు. దీంతో వరుసగా స్టార్ హీరోల సినిమాలు పట్టేశాడు సందీప్. ప్రస్తుతం సందీప్ వంగ రణబీర్ కపూర్‌తో యానిమల్ సినిమా చేస్తున్నాడు. గ్యాంగ్‌స్టర్ కథాంశంతో యానిమల్ సినిమా మోస్ట్ వైలెంట్ గా రానుంది. రణబీర్ కపూర్ హీరోగా రష్మిక మందన్న హీరోయిన్ గా బాబీ డియోల్ ముఖ్య పాత్రలో ఈ సినిమా గ్రాండ్‌గా తెరకెక్కుతుంది. రణ్బీర్ కపూర్ యానిమల్ సినిమాను పాన్ఇండియా రేంజ్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. హిందీతో పాటు పలు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటు న్నారు. యానిమల్ చిత్రాన్ని 11 ఆగస్టు 2024 పాన్ ఇండియా రిలీజ్ చేస్తామని గతంలోనే ప్రకటించారు. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ లేకపోయినా కేవలం టైటిల్ రణబీర్ ఫస్ట్ లుక్ షూటింగ్ నుంచి లీక్ అయిన రణబీర్ పిక్స్ తోనే సినిమాపై భారీ హైప్ నెలకొంది. తాజా విషయం ఏంటంటే... ఈ మూవీ సెట్స్ నుండి తాజాగా ఒక వీడియో ఆన్ లైన్ లో లీక్ అయింది. దీంతో అది ఒక్కసారిగా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇందులో రణబీర్ లెక్చరర్గా కనిపించారు. అలానే ఈ వీడియోలో ఆయన లుక్ చూసిన పలువురు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. మరో సూపర్ హిట్ ఖాయమని అంటున్నారు.

సినిమాలో రణ్‌బీర్ కపూర్ సరసన రష్మికా మందన్నా హీరోయిన్ గా చేస్తోంది. ఇప్పటికే సౌత్లో ఫుల్ పాపులారిటీ పెంచుకున్న రష్మిక.. ఈ సినిమాకు మరో అదనపు బలంగా మారనుంది. టీ సిరీస్ ఫిల్మ్స్ భద్రకాళీ పిక్చర్స్ సినీ 1 స్టూడియోస్ పతాకంపై భూషణ్ కుమార్ ప్రణయ్ రెడ్డి వంగా తదితరులు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది చిత్రబృందం.




# ఆదిపురుష్ విడుదలకు దగ్గర పడుతున్న ముహూర్తం


## తిరుపతిలో 6న భారీగా ప్రీలాంచ్ వేడుకలు



రోజు రోజుకు ఆదిపురుష్ సినిమాపై అంచనాలు భారీగా పెరుగిపోతున్నాయి. మరో రెండు వారాల్లో విడుదల కానున్న ఈ సినిమాపై ప్రేక్షకులే కాదు సినీ సెలబ్రెటీలు సైతం అమితాసక్తితో ఎదురు చూస్తున్నారు. ఈ నెల 16న మూవీ విడుదల కాబోతోంది. రామయణం ఇతిహాసం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు ఓం రౌత్ దర్శకత్వం వహించాడు. గతేడాది రిలీజైన టీజర్ తో చిత్రబృందం తీవ్రంగా ట్రోల్స్ కు గురైంది. గతేడాది చివర్లో విడుదలైన టీజర్ ఓ రేంజ్‌లో ట్రోల్స్‌కు గురైంది. దాంతో చిత్రయూనిట్ దెబ్బకు ఆరు నెలలు షూటింగ్‌ను వాయిదా వేసి మెరుగైన వీఎఫ్ఎక్స్‌ను తీర్చిదిద్దడంలో మునిగిపోయింది. ఇక ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు తిరుగులేని రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌తో వచ్చిన నెగిటీవిటీ అంతా ట్రైలర్‌తో పటా పంచలయింది. మరో రెండు వారాల్లో రిలీజ్ కాబోతున్న ఈ సినిమాపై యావత్ సినీ ప్రేమికులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ రెండు వారాలు చిత్రయూనిట్ ప్రమోషన్ల తో తెగ బిజీ కానున్నట్లు తెలుస్తుంది. ప్రమోషన్లో భాగంగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జూన్ 6న తిరుపతిలో భారీ ఎత్తులో జరుపనున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన మరో అప్డేట్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది. కాగా ఈ సినిమాకు సంబంధించిన సెకండ్ ట్రైలర్ ను ప్రీ రిలీజ్ వేడుకలో రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ట్రైలర్ కట్ కు సంబంధించిన పనులు కూడా పూర్తయినట్లు సమాచారం. మైథలాజికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రభాస్ రాముడి పాత్ర పోషించ గా.. కృతిసనన్ సీతగా కనిపించనుంది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ లంకాధిపతి రావణాసురుడుగా కనిపించనున్నాడు. రెట్రో్ ÷ల్స్, టీ

# మహేశ్‌బాబు బ్రాండ్

## గుంటూరు కారం చొక్కాపై సర్వత్రా చర్చ



సూపర్ స్టార్ మహేష్ బాబు బ్రాండ్ అంబాసిడర్ గా ఎన్నో కంపెనీలకు ప్రచారం చేసిన విషయం తెల్సిందే. సౌత్ స్టార్స్ లో అత్యధిక బ్రాండ్స్ ను ప్రమోట్ చేసిన ఘనత మహేష్ బాబుకు దక్కింది అనడంలో కూడా సందేహం లేదు. మహేష్ బాబు బ్రాండ్ అంబాసిడర్ గా కొత్త పుంతలు తొక్కే విధంగా ఒప్పందాలు చేసుకున్నాడు. ఇప్పుడు మహేష్ బాబు బ్రాండింగ్ గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మహేష్ బాబు తాజా చిత్రం గుంటూరు కారం సినిమాలో మహేష్ బాబు మాస్ లుక్ లో కనిపించబోతున్నాడు. తాజాగా మహేష్ బాబు యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఆ పోస్టర్ లో మహేష్ బాబు ధరించిన షర్ట్ గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మహేష్ బాబు ధరించిన ఆ షర్ట్ కి మంచి డిమాండ్ ఉంది. ఈ కామర్స్ ద్వారా సదరు కంపెనీ యొక్క షర్ట్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ముందుగానే మహేష్ బాబు ధరించిన షర్ట్ అవ్వడంతో అమ్మకాలు ఉంటాయని భావించిన కంపెనీ పెద్ద మొత్తంలో డెలివరీకి రెడీగా ఉంచినట్లుగా తెలుస్తోంది. సదరు కంపెనీతో మహేష్ బాబు ఒప్పందం చేసుకుని గుంటూరు కారం సినిమా లో కనిపించాడా లేదంటే కాకతాళీయంగా జరిగిందా అనేది మాత్రం తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి అయితే గుంటూరు కారం సినిమా ఫస్ట్ లుక్ లో మహేష్ బాబు ఏ షర్ట్ తో అయితే కనిపించాడో ఆ షర్ట్ కి విపరీతమైన డిమాండ్ ఉంది. రూ.3 వేల రూపాయలకు ఆన్ లైన్ లో సూపర్ ఫ్యాన్స్ వేలాదిగా కొనుగోలు చేస్తున్నారు. ఇక మహేష్ బాబు గుంటూరు కారం సినిమా విషయానికి వస్తే త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో హీరోయిన్స్ గా పూజా హెగ్డే మరియు శ్రీలీల నటిస్తున్న విషయం తెల్సిందే. బాలీవుడ్ స్టార్ నటుడు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించబోతున్నాడు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కాబోతుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in